

హద్దు మీరుతున్న వైద్యం
ఏ చిన్న జబ్బు చేసినా అందుబాటులో ఉండే ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స చేసుకోవడం సాధారణం. 8లో▸



వేతనాలు చెల్లించండి
అంగన్‌వాడీల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య కోరారు. 8లో▸



సర్వీసు పునఃప్రారంభం
చక్రంపల్లి– హైదరాబాద్ ఆర్టీసీ బస్సు సర్వీసును సోమవారం ఆ శాఖ అధికారులు పునఃప్రారంభించారు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణికి 179 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 179 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ, భూ సమస్యల పరిష్కారం కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. రుణమాఫీ ఫిర్యాదులను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్‌డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి మోడల్ స్కూల్, కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధించేందుకు (గంటల చొప్పున) అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్‌కాం, బీఈడీ చేసిన వారు అర్హులన్నారు. ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 28న డెమో క్లాస్ నిర్వహిస్తామని తెలిపారు.

అక్రమ రవాణాపై నిఘా పెట్టండి

ఎస్పీ నారాయణరెడ్డి



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

దౌల్తాబాద్: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దౌల్తాబాద్ మండలం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దున ఉన్నందున పీడీఎస్ బియ్యం రవాణాపై నిఘా పెట్టాలన్నారు. గుట్కా, గంజాయి రవాణా చేస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రవిగౌడ్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి: కక్షిదారులు రాజీకి సిద్ధంగా ఉంటే ఈ నెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్న వారు రాజీ కావాలనుకుంటే స్థానిక పీఎస్‌లో సంప్రదించాలన్నారు. రాజీ మార్గమే రాజమర్గమన్నారు.

ఆమనగల్లు ఠాణాను తనిఖీ చేసిన ఏసీపీ

ఆమనగల్లు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం షాద్‌నగర్ ఏసీపీ ఎస్‌సీహెచ్ రంగస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదవుతున్న క్రైంరేటు వివరాలు, చోరీ కేసుల్లో రికవరీ తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సఖ్యతగా మెలగాలని సూచించారు. సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్, ఏఎస్ఐలు యాదయ్య, బాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

30న జిల్లాస్థాయి యువ కళాకారుల ఎంపిక

హుడాకాంప్లెక్స్: 28వ జాతీయ యువజనోత్సవాల సందర్భంగా ఈ నెల 30వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి యువ కళాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారి వయస్సు 15 నుంచి 29 సంవత్సరాల లోపు ఉండాలని, జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం పొందిన కళాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. అక్కడ ఎంపిక చేసిన ఉత్తమ కళాకారులు జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు. జానపద సంగీతం, జానపద నృత్యం, కథ రచన, పెయింటింగ్, కవిత్వం, యువక్రితి, సైన్స్ మేళా విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని, ఇతర వివరాలకు 9849909077 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రాడార్ సెగ!

నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న ప్రజాసంఘాలు



నేవీ రాడార్ స్టేషన్ కోసం పరిశీలించిన స్థలం ఇదే..

- పర్యావరణానికి, జీవకోటికి ముప్పంటున్న నాయకులు
- 12.5 లక్షల చెట్లు నరికేస్తారంటూ ప్రచారం
- ఇది అవాస్తవమంటున్న అటవీ శాఖ అధికారులు
- వచ్చే నెలలో శంకుస్థాపనకు సన్నాహాలు
- సీఎం, కేంద్ర మంత్రి చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు
- రాజధాని కేంద్రంగా ఆందోళనకు సిద్ధమవుతున్న స్థానికులు

వికారాబాద్: జిల్లాలోని దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటును స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు, పర్యావరణ ప్రేమికులు వ్యతిరేకిస్తున్నారు. స్థానికంగా, నియోజకవర్గంలో, జిల్లా కేంద్రంలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. సెమినార్లు నిర్వహించి నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేస్తే కలిగే ముప్పును ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళుతున్నారు. నిరసన కార్యక్రమాలను తీవ్రతరం చేయాలన్న సంకల్పంతో హైదరాబాద్ కేంద్రంగా ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. దీంతో ఈ అంశం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జిల్లాకే తలమానికం కానున్న నేవీ రాడార్ స్టేషన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. వచ్చే నెలలో సీఎం, కేంద్ర మంత్రుల చేతుల మీదుగా ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పదేళ్ల క్రితమే పూడూరు మండలం దామగుండం సమీపంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని భావించారు. దేశ రక్షణలో భాగంగా లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అప్పటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయించింది. పనులు ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చింది. ఇందులో భాగంగా 2,900 ఎకరాల అటవీ భూములను నేవీకి అప్పగించడానికి అంగీకరించారు. ఫారెస్ట్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక గ్రామ పంచాయతీతో పలు ఒప్పందాలు కూడా చేసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాజెక్టు మరుగున పడిపోయింది. తాజాగా శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు నేతలు, ప్రజా సంఘాల నాయకులు స్థానికులతో కలిసి ఆందోళనకు సిద్ధమయ్యారు. ఇక్కడ నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేయరాదంటూ ఆందోళన బాట పట్టారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో వాదన

నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుపై ప్రభుత్వం, ప్రతిపక్షం, అధికారులు ఒక్కో రకం వాదనలు వినిపిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు, ఓ స్వామిజీ, ప్రజా సంఘాల నాయకులు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేస్తే పర్యావరణానికి, ఈ ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని అంటున్నారు. బీజేపీ ముఖ్య నాయకులు మాత్రం ఈ విషయంపై స్పందించడం లేదు. మండల నాయకులు మాత్రం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు.

అన్ని అనుమతులు పూర్తి

జిల్లాలో లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో దాదాపు అన్ని అనుమతులు వచ్చాయి. ప్రాజెక్టు కోసం దామగుండం నుంచి పరిగి సమీపంలో గల మల్లెమానిగూడ వరకు 2,900 ఎకరాల అటవీ భూములు అవసరం అవుతాయని నేవీ సంస్థ అంచనా వేసింది. ఇక్కడ తొలంగించనున్న చెట్ల స్థానంలో మూడింతలకు పైగా మొక్కలు పెంచేందుకు అటవీ శాఖకు రక్షణ శాఖ రూ.150 కోట్లు బదిలీ చేసింది.

460 మీటర్ల ఎత్తులో..

దామగుండం అటవీ ప్రాంతంలో సుమారు 460 మీటర్ల ఎత్తులో నేవీ రాడార్ స్టేషన్‌కు సంబంధించిన యాంటినాలు ఏర్పాటు చేయనున్నారు. వాటి ద్వారానే సిగ్నల్ అందుతుంది. ఇది లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ కావడం వల్ల రేడియేషన్ కూడా చాలా తక్కువగా వస్తుందని రక్షణ శాఖ అంటోంది.

ప్రపంచంలోనే ఐదోది

ప్రపంచంలోనే ఐదో అత్యాధునిక రాడార్ వ్యవస్థ ఏర్పాటుకు జిల్లా కేంద్ర బిందువుగా మారనుంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.1,900 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. పూర్తిగా గ్రామీణ నేపథ్యం.. వెనుకబడిన జిల్లాకు ఇలాంటి ప్రాజెక్టు మంజూరు కావడం శుభ పరిణామం అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు అంటున్నారు. పూడూరు, పరిగి, వికారాబాద్ మండలాల పరిధిలోని 15 గ్రామాల ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు.

అధికారులు ఏమంటున్నారంటే..

రక్షణ శాఖ విజ్ఞప్తి మేరకు అటవీ శాఖ దామగుండం పరిధిలోని 2,900 ఎకరాల ఫారెస్ట్ భూమిని వారికి ఇచ్చేందుకు అంగీకరించింది. ప్రాజెక్టు ఏర్పాటులో భాగంగా 12.5లక్షల చెట్లను తొలగిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ అటవీ శాఖ అధికారులు మాత్రం ఇది అవాస్తవం అంటున్నారు. నేవీకి అప్పగించే భూమిలో చిన్న చిన్న పొదలు, ఖాళీ ప్రదేశం మాత్రమే ఉంది. దట్టమైన అటవీ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరని తెలిపారు. ఈ మేరకు నేవీ అధికారులు హామీ కూడా ఇచ్చారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే లక్ష నుంచి 1.5 లక్షల చెట్లు తొలగించే అవకాశం ఉన్నట్లు ఫారెస్టు శాఖ అంచనా వేస్తోంది. రాడార్ స్టేషన్ ఏర్పాటు చేసే ప్రాంతం, ఇతర నిర్మాణాలు చేపట్టే ప్రదేశాల్లో మాత్రమే చెట్లను తొలగిస్తారు. ఈ నష్టాన్ని పూడ్చేందుకు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 17.5లక్షల మొక్కలు నాటేందుకు అటవీ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలి



నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు మా పార్టీ వ్యతిరేకం కాదు. ఈ ప్రాజెక్టును మరో ప్రాంతంలో ఏర్పాటు చేస్తే మంచిది. పర్యావరణానికి, మానవాళికి నష్టం కలగని చోట ఏర్పాటు చేయాలి. ఎక్కడ ఏర్పాటు చేయటం వల్ల ఈ ప్రాంతానికి లాభం కంటే నష్టమే ఎక్కువ. 12.5లక్షల చెట్లను తొలగించాలంటున్నారు.రేడియేషన్ పెరిగి పర్యావరణం కూడా దెబ్బతింటుంది. అందుకే ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నాం. – కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, పరిగి

అభివృద్ధికి ఊతమివ్వనుంది



జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో పయనించాలంటే ఇలాంటి ప్రాజెక్టులు ఎంతో అవసరం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టుకు మెజార్టీ అనుమతులు వచ్చాయి. అప్పుడు భూములు ఇస్తామని.. ఇప్పుడు మాట మార్చి డ్రామా ఆడుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లా రూపురేఖలే మారిపోతాయి.

– టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరత్నం

సీపీఎస్‌ను రద్దు చేయాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

పరిగి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం అన్నారు. సోమవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న డీఏ బిల్లులు, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి ఏడాది కావస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ను రద్దు చేయాలన్నారు. ఓ పక్క ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెబుతూనే ప్రీ ప్రైమరీ, ప్రైమరీ తరగతులను అంగన్‌వాడీ కేంద్రాల్లో విలీనం చేయడం సరికాదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు చెల్లింపులో జాప్యంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నెల 28న గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, జిల్లా, మండల నాయకులు మోయిజ్‌ఖాన్ బిచ్చన్న, వెంకటయ్య, దశరథ్, గంగాధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ నిబంధన సరికాదు

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

దుద్యాల్: ప్రాథమిక పాఠశాల స్థాయిలో రేషనలైజేషన్ నిబంధనలు తేవడం సరికాదని, పాఠశాలలోని ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని హస్నాబాద్ జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో రేషనలైజేషన్ నిబంధనలు అమలు చేస్తే బోధన పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక పాఠశాలలో మొదటి 20 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఆ తరువాత 20 మందికి ఒక టీచర్ ఉండేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. వెంటనే డీఎస్సీ ఫలితాలు వెల్లడించి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. 2022 జూలై నుంచి నేటి వరకు బకాయి ఉన్న డీఏలు, పీఆర్సీని ప్రకటించాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసి వెంటనే సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజిలప్ప, గోపాల్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్



జ్యోతి వెలిగించి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మిషన్ భగీరథ గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఆంజనేయులు

నీటి సరఫరాపై అవగాహన ఉండాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మిషన్ భగీరథ గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఆంజనేయులు
- మంచినీటి సహాయకులకు శిక్షణ ప్రారంభం

చేవెళ్ల: గ్రామాల్లో ఉండే వాటర్‌మెన్ నీటి సరఫరాతో పాటు మరమ్మతులపై అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మిషన్‌భగీరథ గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఆంజనేయులు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని గ్రామ మంచినీటి సహాయకులకు (వాటర్ మెన్) నాలుగురోజుల శిక్షణ తరగతులను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటిని సకాలంలో, సక్రమంగా, ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందించడంలో వాటర్‌మెన్ పాత్ర కీలకమన్నారు. అలాంటి వాటర్‌మెన్‌కు అన్ని విషయాలపై అవగాహన ఉండడం ఎంతో అవసరమన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతుల్లో వారికి యంత్రాలు, మోటార్లు, వాటిని ఎలా ఉపయోగించాలి.. ఏదైనా సమస్య వస్తే ఎలా పరిష్కరించాలనే వాటిపై శిక్షణ ఇస్తారని తెలిపారు. వీటిని వాటర్‌మెన్‌లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటి రోజు చేతిపంపుల వాడకం, మరమ్మతులపై గ్రామీణ వాటర్ సప్‌లై ఎస్ఈ అంజనేయులు, జిల్లా ఈఈ రాజేశ్వర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ డీఈ హారిక, గ్రిడ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ హిమబిందు, డివిజన్ ఏఈలు గీతా స్రవంతి, చంద్రమోహన్‌రెడ్డి, గంగా తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో..

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో తాగునీటి సరఫరాపై మంచినీటి సహాయకులు అవగాహన పెంచుకోవాలని మిషన్‌భగీరథ గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఆంజనేయులు, జిల్లా ఈఈ రాజేశ్వర్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మిషన్ భగీరథ డీఈ హారిక, ఏఈ ఇమ్రాన్ అహ్మద్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని 28 పంచాయతీలకు మంచినీటి సరఫరా చేసే సహాయకులకు నాలుగు రోజుల శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగింపు సరికాదు

- ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రతినిధులు
- ప్రభుత్వం పునరాలోచించాలని వినతి



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సరికాదని, ప్రభుత్వం పునరాలోచించాలని ఆర్య వైశ్య మహాసభ జిల్లా ప్రతినిధులు కోరారు. రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని 56 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మబలిదానం గావించి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన మహనీయుడుం అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన మహాత్మా గాంధీజీ ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం యూనివర్సిటీ పేరును సురవరం ప్రతాపరెడ్డిగా మార్చడంపై పునరాలోచించాలన్నారు. సురవరం జ్ఞాపకార్థం ఏదైన కొత్త ప్రాజెక్టుకు ఆయన పేరు పడితే మంచిదన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని భావితరాలకు తెలియజెప్పే విధంగా తెలుగు విశ్వవిద్యాలయానికి ఆ పేరునే యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కట్కం శివకుమార్ గుప్తా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా కోశాధికారి ఆకారపు రాజుగుప్తా, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గుప్తా, అదనపు కార్యదర్శి వీరేందర్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొకుంట్ల కృష్ణకుమార్ గుప్తా, నాయకులు విజయలక్ష్మి, ప్రశాంత్, పెంటయ్య, యాస్కి శిరీష, శ్రీలత, శ్రీరాములు, సోమ నర్సింలు, మాలె శ్రీనివాస్, ఎన్నారం పాండు, వేణుగోపాల్, ఈర్లేల్లి రఘునందం పాల్గొన్నారు.

‘పట్నం’ చెరువులపై హైడ్రా నజర్

- అక్రమ నిర్మాణాలను పరిశీలించిన అధికారులు



చెరువులను పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న హైడ్రా ఆర్ఎఫ్ఓ పాపయ్య

ఇబ్రహీంపట్నం: పట్నం పెద్ద,చిన్న చెరువులు, అక్కడి అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు సోమవారం పరిశీలించారు. తొలిసారి ఔటర్ రింగు రోడ్డును దాటి రావడంతో కబ్జాదారుల్లో వణుకు పుట్టింది. పెద్దచెరువును అంటిపెట్టుకొని ఉన్న చిన్న చెరువుతోపాటు ఉప్పరిగూడ,పోచారం,చర్లపటేల్‌గూడలో అక్రమ నిర్మాణాలను హైడ్రా ఆర్ఎఫ్ఓ పాపయ్య ఇరిగేషన్ డిప్యూటీ డీఈ ఉషారాణి, ఏఈ రాజ్యలక్ష్మి, ఏసీపీ కేపీవీ రాజు, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. చిన్న చెరువు, బఫర్ జోన్‌లో ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారు హైడ్రా అధికారులు వచ్చారన్న విషయం తెలియగానే ఆందోళనకు గురయ్యారు. తమ పరిస్థితిని వారికి వివరించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారి జోలికి వెళ్లమని, కొత్త నిర్మాణాలు ఎవరూ చేపట్టొద్దని అధికారులు తెలిపారు. వారం రోజుల్లో చిన్న చెరువు, పెద్ద చెరువుల విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వివరాల నివేదికలను పంపించాలని ఇరిగేషన్ అధికారులు ఉషారాణి, రాజ్యలక్ష్మిని హైడ్రా ఆర్ఎఫ్ఓ పాపయ్య ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో జరిగిన నిర్మాణాలు, చెరువులోకి వరదనీరు తీసుకొచ్చే ఫిరంగి, పెద్ద కాలువలు ఏ మేర కబ్జాలకు గురయ్యాయో పూర్తి వివరాలు అందజేయాలని సూచించారు.

క్లుప్తంగా

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

తాండూరురూరల్: మండల పరిధిలోని సంగెం కలాన్ శివారులో దళితుల భూమిని కబ్జాచేసిన గని యజమానిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి కేసు విచారించారు. వివరాలు.. సంగెంకలాన్ శివారులోని అసైన్డ్ భూమి సర్వేనెంబర్ 109లో తిప్పన్నకు 2.24ఎకరాల భూమి ఉంది. కాగా గని యజమాని శివారెడ్డి తిప్పన్నకు చెందిన 28 గుంటల భూమిని కబ్జా చేశాడు. దీంతో తిప్పన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడతో శివారెడ్డిపై సెప్టెంబర్ 9వ కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం డీఎస్పీ కేసు విచారించారు. ఆయన వెంట ఎస్ఐ విఠల్‌రెడ్డి ఉన్నారు.

అత్తింటి వేధింపులకు వ్యక్తి బలవన్మరణం


రాజు మృతదేహం

ధారూరు: అత్తింటి వేధింపులతో మనోవేదనకు గురైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ధారూరు ఠాణా పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మోమిన్‌ఖుర్దు గ్రామానికి చెందిన హరిజన్ రాజు(36)కు హరిదాస్‌పల్లికి చెందిన లక్ష్మితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు సంతానం. దంపతులిద్దరూ తరుచూ గొడవపడి లక్ష్మి పుట్టింటికి వెళ్లేది. రాజు గ్రామ పెద్దలతో మాట్లాడి మళ్లీ ఇంటికి తీసుకువచ్చేవాడు. ఏడు నెలల క్రితం పుట్టింటిక వెళ్లిన లక్ష్మి తిరిగి రాలేదు. దీంతో రాజు ఈ నెల 21 భార్యను తీసుకువస్తానని తల్లి వెంకటమ్మకు చెప్పి వెళ్లాడు. ఈ నెల 22న తల్లికి ఫోన్ చేసి 'మీ కోడలు మన ఇంటికి రానంటుంది. అత్త భాగ్యమ్మ, బావమరిది మల్లేశం, భార్య లక్ష్మి అసభ్యపదజాలంతో దూషించి కొట్టి ఇంటి నుంచి గెంటేశారని' చెప్పాడు. అదే రోజు ధారూరుకు వచ్చి గడ్డి మందు తాగి స్థానిక పోస్టాఫీస్ కార్యాలయం వెనుక స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణం తరలించండి

కందుకూరు: పాఠశాలకు చేరువలో మద్యం దుకాణం ఉండటం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, షాపును అక్కడి నుంచి తరలించాలని బీజేపీ నాయకుడు సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమ వారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై.. సంబంధిత శాఖ అధికారులకు గతంలో ఫిర్యాదు చేశామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని సురేందర్ ఆరోపించారు.

ఇసుక డంప్‌ల గుర్తింపు


ఇసుక డంపును చెల్లాచెదురు చేసున్న అటవీ సిబ్బంది

ధారూరు: ధారూరు ఫారెస్టులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను ఫారెస్టు అధికారులు గుర్తించి ధ్వంసం చేశారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. ధారూరు ఫారెస్టు రేంజర్ రాజేందర్ తెలిపిన ప్రకారం.. రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో, కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు నుంచి ప్రవహిస్తున్న వాగు నీటిలో వచ్చిన ఇసుకను అడవిలో ఓ చోట నిల్వ చేసి రాత్రిపూట దొంగతనంగా తరలించి అమ్ముకుంటున్నారు. సోమవారం ఫారెస్టు రేంజర్, అధికారులు, సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా నాలుగు చోట్ల డంపులను గుర్తించారు. వీటిని రేంజర్ సిబ్బంది ద్వారా ధ్వంసం చేయించారు. అక్రమ ఇసుక తరలింపుపై రాత్రిళ్లు తనిఖీలు చేపట్టి అడవిలోకి రాకుండా దారులను మూసివేయిస్తామని రేంజర్ రాజేందర్ తెలిపారు.

హద్దు మీరుతున్న వైద్యం

ఆర్‌ఎంపీలే డాక్టర్లు!
- నిబంధనలు బేఖాతరు
- పరిమితికి మించి స్టెరాయిడ్స్ వాడకం


క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు (ఫైల్)

ఆరోగ్యమే మహా భాగ్యం. వ్యక్తిగత ఆరోగ్యానికి ఇబ్బంది అయితే వైద్యులు చెప్పే ప్రతీ విషయాన్ని తూచా తప్పకుండా పాటిస్తాం. ఇదే అదునుగా ప్రాథమిక చికిత్స సెంటర్లు ఇష్టానుసారంగా వైద్యం చేస్తూ ప్రజల జేబులు గుల్ల చేస్తున్నారు. పర్యవేక్షణ లోపం కారణంగా వారికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

కుల్కచర్ల: ఏ చిన్న అనారోగ్యం వచ్చిన అందుబాటులో ఉండే ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స చేసుకుంటాం. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు ఆర్‌ఎంపీలు పేదల జేబులు ఖాళీ చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల చౌడాపూర్‌లో జిల్లా వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో అన్నీ అనవసరమైన మందులే లభ్యమయ్యాయి. అనుమతులు లేని డయోగ్నోస్టిక్ సెంటర్లు నిర్వహించడం.. టెక్నీషియన్స్‌కు సైతం విద్యార్హత లేదని గుర్తించారు.

మూడు క్లినిక్‌లు, రెండు డయోగ్నస్టిక్ సెంటర్లు సీజ్

అధికారులు నిర్వహించిన తనిఖీల్లో మూడు క్లినిక్‌లు, రెండు డయోగ్నస్టిక్ సెంటర్లు సీజ్ చేశారు. ప్రాథమిక చికిత్స కేంద్రాల్లో పరిమితికి మించి స్టెరాయిడ్‌లు ఇస్తున్నారని అధికారులు వెల్లడించారు. చౌడాపూర్ గ్రామంలో ప్రభుత్వం మినీ సబ్ సెంటర్ కొనసాగిస్తోంది. అక్కడ ఏఎన్‌ఎంలు మాత్రమే ఎక్కువ సమయం ఉండటంతో వైద్యులు అందుబాటులో ఉండరనే భావించి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

త్వరలో రీఓపెన్?

ఈ నెల 18న జిల్లా వైద్యాధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి సీజ్ చేసిన క్లినిక్‌లు రెండు రోజుల్లో తెరుచుకుంటాయనే ప్రచారం సాగుతోంది. వాటికి అనుమతులు ఇచ్చి రీఓపెనింగ్‌కు పచ్చా జెండా ఊపినట్లు తెలుస్తోంది. పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు శ్రమించాల్సిన ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సేవలు వినియోగించుకోవాలి



ప్రజలు ప్రభుత్వాస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలను వినియోగించుకోవాలి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పరిమితికి మించి స్టెరాయిడ్స్ వాడుతున్నారు. దీంతో భవిష్యత్‌లో అనారోగ్య పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుంది. త్వరగా జ్వరం తగ్గాలని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించడం సరికాదు.

– వాజుద్దీన్, వైద్యాధికారి, కుల్కచర్ల

పెండింగ్ వేతనాలు చెల్లించండి


అనంతగిరి: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

- అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య

అనంతగిరి: అంగన్‌వాడీలకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో పెట్టిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అంగన్‌వాడీలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు పెండింగ్ వేతనాలు చెల్లించి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రెండు జతల యూనిఫాంలు అందజేయాలని కోరారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్‌కు అర్హులుగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మా చెరువును పరిరక్షించండి

కుల్కచర్ల: గ్రామ పరిధిలోని చెరువును కాపాడాలని కోరుతూ చౌడాపూర్ మండలం లింగంపల్లి గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. వివరాలు.. గ్రామంలోని సర్వే నంబర్ 64, 69 భూమిలో మ్యాకలోని చెరువు ఉంది. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ చెరువు స్థలాన్ని గుర్తించడంలో సర్వే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఓ వసుచంద్ర అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్నవారి నుంచి వినతిపత్రం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వే చేసి లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. చెరువు సర్వేకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు గ్రామస్తులతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అఖిలపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన లింగంపల్లి గ్రామస్తులు

సభ్యత్వానికి స్వచ్ఛందంగా ముందుకు


బీజేపీ సభ్యత్వ నమోదు అందజేస్తున్న మాధవరెడ్డి, ఈశ్వరప్ప తదితరులు

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప

అనంతగిరి: బీజేపీ సభ్యత్వ నమోదుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచం మోదీ పాలనను ఆదరిస్తోందన్నారు. బలమైన కార్యకర్తలున్న పార్టీగా బీజేపీ రికార్డులెక్కుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, జిల్లా ఇన్‌చార్జి భానుప్రకాష్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గాజుల శాంతి కుమార్, రామన్న, మోహన్‌రెడ్డి, అనిల్‌యాదవ్, శ్రీకాంత్, సోము, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సంక్రమణ వ్యాధులపై అవగాహన అవసరం

సంపూర్ణ సురక్షా కేంద్రం మేనేజర్ కృష్ణవేణి


విద్యార్థుల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

తాండూరు: ప్రాణాంతకమైన సంక్రమణ వ్యాధులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని తాండూరు సంపూర్ణ సురక్షా కేంద్రం మేనేజర్ కృష్ణవేణి అన్నారు. సోమవారం తాండూరు జిల్లా ఆస్పత్రిలోని ఐసీటీసీ, ఏఆర్‌టీ సెంటర్ ఆధ్వర్యంలో సంపూర్ణ సురక్షా కేంద్రం ఆధ్వర్యంలో జినీగుర్తిలోని గిరిజన గురుకుల బాలికల విద్యాలయంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్, ఎస్టీఐ, ఎస్‌టీడీ, ఐఈసీ లాంటి వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్రమణ వ్యాధులపై సమాచారం తెలుసుకోవాలంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1097కు ఫోన్ చేయాలన్నారు. హెచ్‌ఐవీ వ్యాధి ఒకరినుంచి మరొకరికి సంక్రమించే వ్యాధి అన్నారు. ఈ వ్యాధి ప్రధానంగా ఒకే సూదిని వాడటం, లైంగిక వ్యాధులను దాచుకోవడం వల్ల ఒకరి నుంచి మరొకరికి సోకుతోందన్నారు. ఇలాంటి వ్యాధి సోకిన వారి కోసం తాండూరులోనే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధి సోకిన వారు దాచుకుంటే వారి కుటుంబ సభ్యులందరికీ సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం సైతం అంతే ముఖ్యమన్నారు. జీవితంలో సురక్షితంగా ఉండటానికి విలువలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ పర్వతాలు, సిబ్బంది ప్రకాష్, అనంతప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరలున్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం

తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్


రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సమయానికి రక్తదానం అందించేందుకు రక్తనిధి కేంద్రంలో యువకులు రక్తదానం చేయడం అభినందనీయమని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. సోమవారం తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు బిర్కట్ రఘు ఆధ్వర్యంలో పట్నం అభిమానులు, కాంగ్రెస్ నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు 20 మంది యువకుల నుంచి రక్తం సేకరించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పాలు, పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోయ రవిరాజ్, మహిళ కాంగ్రెస్ నాయకురాలు నాగమ్మ, యువజన సంఘం నాయకులు పునీత్, మంతన్‌గౌడ్ అశోక్, సిద్దు తదితరులున్నారు.

చిన్నారులు వయసుకు తగిన బరువుండాలి

మర్పల్లి సీడీపీఓ ప్రవీణ

మర్పల్లి: చిన్నారులు వయసుకు తగిన బరువు ఉండాలని మర్పల్లి సీడీపీఓ ప్రవీణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎస్ఎస్ఎఫ్‌పీలో చిన్నారుల ఆరోగ్యస్థితి గతులపై, ఎదుగుదలపై ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ప్రవీణ మాట్లాడుతూ.. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆట పాటలతో విద్యాబోధన చేస్తున్నారా లేదా? భోజనంలో మెనూ పాటిస్తున్నారా తదితర విషయాలను ఆశ వర్కర్లు రోజు ఆరా తీయాలన్నారు. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల బరువు వివరాలు నమోదు చేస్తున్న అంశాలపై ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ్‌కుమార్, పీహెచ్ఎన్ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్లు తిరుపతయ్య, అమరేశ్వరీ, రుద్రాణి, ఆయా గ్రామాల సబ్‌సెంటర్ల ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి


పశువుల కళేబరాలు

మహేశ్వరం: విద్యుదాఘాతంతో రెండు పాడి పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మహేశ్వరం మండలం డబిల్‌గూడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కర్ణం ప్రభాకర్ పాడి పశువులతో జీవనోపాధి పొందుతున్నాడు. రోజులాగే సోమవారం మూగ జీవాలను మేతకు వదలగా.. అవి మేత మేస్తూ.. తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయి. దీంతో బాధిత రైతు విలపిస్తూ.. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలనే పశువులు చనిపోయాయని ఆరోపించారు. కరెంటు తీగల గురించి ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదని, వారి కారణంగానే రూ.1.40 నష్టపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

డ్రగ్స్ పట్టివేత

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

ఇబ్రహీంపట్నం: డ్రగ్స్ తీసుకుంటూ ముగ్గురు యువకులు సోమవారం పట్టుబడ్డారు. ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఇబ్రహీంపట్నంలో ని బృందావన్ కాలనీలో డ్రగ్స్ తీసుకుంటున్న ముగ్గురు యువకులను పోలీసు లు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాతో పాటు ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీపీ తెలిపారు.

కానిస్టేబుల్‌ను దూషించిన వ్యక్తికి రిమాండ్


అన్వర్‌పాషాను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

తాండూరు టౌన్: విధులు నిర్వహిస్తున్న కానిస్టుబుల్‌ను దూషించిన వ్యక్తిని తాండూరు టౌన్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అన్వర్‌పాషా, గిరిజన గోపాల్ డబ్బుల విషయంలో గొడవపడ్డారు. సమాచారం అందుకున్న బ్లూకోట్ పోలీసు బండి నరేష్ అన్వర్‌పాషాను నిలువరించేందుకు యతింంచాడు. ఈ క్రమంలో కానిస్టేబుల్‌ను నెట్టివేస్తూ దూషించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు అన్వర్‌పాషాను అరెస్ట్ చేసి కోర్టుకు తీసుకెళ్లగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ వ వెల్లడించారు.

యువతి అదృశ్యం


మహేశ్వరం: పదూ...

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్‌పూర్ మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన వడ్డె రాఘవేందర్ కుటుంబం ఏడాది కాలంగా జీవనోపాధి నిమిత్తం దేవేందర్ కాలనీలో నివాసం ఉంటోంది. వీరి కుమార్తె నందిని(15) స్థానికంగా ఉండే బంధువుల ఇంట్లో టైలరింగ్ నేర్చుకునేందుకు రోజూ వెళ్తుంటుంది. ఈ నెల 10న కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటికి వెళ్లొచ్చే సరికి యువతి కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా లభ్యం కాలేదు. దీంతో వారి గ్రామానికి చెందిన కదిరె రమేష్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తంచేస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతసాగర్, గోరిగడ్డతండా తదితర గ్రామాల్లో గ్యాస్ సబ్సిడీదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే నిరుపేదల ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాంచందర్, ఆనందం, కృష్ణయ్య, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రొసీడింగ్స్ అందజేస్తున్న నాయకులు

బంతి సాగు.. లాభాలు బాగు

- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి
- పూల సేద్యంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి



షాబాద్: నీటి వసతి కలిగిన ప్రాంతం బంతి పూల సాగుకు అనుకూలమైనది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడితో పాటు అంతే స్థాయిలో లాభాలు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ సాగులో డ్రిప్ పద్ధతిని అనుసరిస్తే.. నీటిని కూడా పొదుపు చేయవచ్చునని పేర్కొంటున్నారు. మార్కెట్లో బంతికి ఎక్కువగా డిమాండ్ ఉంటుందని, ప్రతి పూజాకార్యక్రమాలు, వివాహాలు, గృహప్రవేశాలు తదితర వాటిల్లో విధిగా బంతిని వినియోగిస్తారని వెల్లడించారు. తక్కువ నీటి వనరులతో బంతిని సాగు చేస్తూ.. సస్యరక్షణ చేపడితే రైతులకు లాభాల పంటేనని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం స్పష్టంచేస్తున్నారు. ఆయన తెలిపిన సూచనలు, సలహాలు ఇలా ఉన్నాయి.


సర్దార్‌నగర్ గ్రామంలో బంతి పూల తోట

సలహాలు.. సూచనలు

బంతి పూలలో ఆఫ్రికన్ బంతి, ఫ్రెంచ్ మేరీ గోల్డ్ రకాలు ఉన్నాయి. నీటి వసతి కలిగిన అన్ని కాలాలు వాటి సాగుకు అనుకూలం. సారవంతమైన గరప నేలలు, నీరు త్వరగా ఇంకిపోయే నేలలు పంటకు తగినవి. పూలు ఏపుగా పెరిగినప్పటికీ ఉత్పత్తి తగ్గే అవకాశాలు ఉన్నాయి. బంతి సాగుకు విత్తనాల ద్వారా కానీ, కత్తిరింపుల ద్వారా కానీ ప్రవర్ధనం చేయవచ్చు. ఎకరానికి వెయ్యి గ్రాముల విత్తనాలు అవసరం అవుతాయి. మడులను తయారు చేసి విత్తనాలను చల్లుకోవాలి. మడులను తయారు చేసే సమయంలో ఎకరానికి 20 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువు వేసి కలియ దున్నుకోవాలి. దీంతో పాటు 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి. నాటిన 37 రోజులకు 20 నుంచి 40 కిలోల నత్రజనిని వేసి నీరు పెట్టుకోవాలి. పాలిడాల్ పొడి చల్లడం వలన చీమలు, చెదలను నివారించుకోచ్చు. విత్తిన విత్తనాలు వారం రోజుల్లో మొలకెత్తుతాయి. నెల వయసు కలిగిన బంతి మొక్కలు నాటుకోవడానికి అనుకూలంగా ఉంటాయి. నాటుకు వచ్చిన నారును సాయంత్రం వేళల్లో నాటుకోవాలి.

నీరు పెట్టుకునే విధానం

నాటిన 60 రోజుల తర్వాత పూత దశ వచ్చే వరకు నేలల్లో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. నీటి ఎద్దడితో దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

సస్యరక్షణ చర్యలు

పేను.. పూల మొగ్గలను ఆశించి నష్ట పరుస్తాయి. వీటి నివారణకు లీటర్ నీటికి మోనోక్రొటోఫాస్ 1.5మి.లీ. కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. తామర పురుగులు.. ఆకులు, పూల నుంచి రసాన్ని పీల్చి నష్టం కలిగిస్తాయి. ఆకులపై తెల్లని మచ్చలు ఏర్పడతాయి. మొగ్గలు గోధుమ రంగుకు మారి ఎండిపోతాయి. వీటి నివారణకు మోనోక్రొటోఫాస్ 1.5 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొగ్గతొలిచే పురుగులు.. లార్వాలు పూల మొగ్గలను తొలుస్తాయి. వీటి నివారణకు ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

తెగుళ్ల నివారణ

నీటి తడి ఎక్కువగా ఉండి, వేడిగా ఉన్న చోట నారుకు కుళ్లు తెగులు వ్యాపిస్తుంది. తద్వారా లేత మొక్కలు చనిపోతాయి. మడులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలి. నేలను లీటర్ నీటికి 2 గ్రా. కాప్టాన్ మందుతో తడపాలి. ఆకు మచ్చ తెగులు.. మొక్కల్లో బూడిద రంగు, లేదా నల్లని మచ్చలు ఏర్పడతాయి. లీటర్ నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

విచ్చుకున్న తరువాతే కోయాలి

బంతి పూలు బాగా విచ్చుకున్న తర్వాతనే కోయాలి. కోతకు ముందు నీటి తడి ఇచ్చినట్లయితే.. పుష్పాలు ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి. పూలను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే కోయాలి. సాధారణంగా ఎకరానికి నాలుగు నుంచి ఐదు టున్నుల దిగుబడి వస్తుంది.